సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం, 18, మార్చి, 2025



అన్నార్తులకు అండగా..

దమ్మపేట మండలం ముష్టిబండలోని శ్రీ రంగనాథ స్వామి ఆశ్రమం గత నాలుగేళ్లుగా అన్నార్తుల ఆకలి తీరుస్తోంది. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.25

సహర్ (బుధవారం ఉ॥) 4.58

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 22°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు ప్రతాపురం గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు స్వామివారికి మహాపూర్ణాహుతి, బలిహరణం, చక్రస్నానం, ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి శృంగార డోలోత్సవంతో వేడుకలు ముగిసినట్లు అర్చకులు ప్రకటించారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పాకాల వెంకటరమణ పాల్గొన్నారు.

రామాలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం చేశారు. అలాగే స్వామివారి మూలమూర్తులను ముత్తంగి రూపంలో అలంకరించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

భద్రాచలం: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. ఐటీడీఏలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో దరఖాస్తులను స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ వినతిపత్రాలు సమర్పించే వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి దరఖాస్తును నమోదు చేసి అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ రవీంద్రనాథ్, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, ఎస్‌ఓ భాస్కర్, మణిధర్, ఉదయ్‌కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'బైరెడ్డి'



బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల విభజనకు ముందు కూడా ఆయన జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. విభజన తర్వాత 2017 నుంచి 2020 వరకు భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. అనంతరం ములుగు, మహబూబాబాద్ జిల్లాల అధ్యక్షుడిగా కూడా కొంతకాలం పనిచేశారు. తిరిగి రెండో సారి ప్రభాకర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన నియామకం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు..

కొత్తగూడెంఅర్బన్: గతేడాది జనవరిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 31 మంది స్టాఫ్ నర్సులకు, 33 మంది ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులకు సోమవారం నియామక పత్రాలు అందించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాలాజీ, సుదర్శన్, సిబ్బంది చిన్నోజీ, ధనుజా తదితరులు పాల్గొన్నారు.



భాగ్యనగరానికి బస్సులేవి?

జిల్లాలోని పలు మండలాల నుంచి హైదరాబాద్‌కు లేని ఆర్టీసీ సర్వీసులు

- ఇప్పటికీ పొరుగు జిల్లా బస్సులే ఏజెన్సీ ప్రజలకు ఆధారం
- మారుమూల మండలాలకు సైతం నడపించని అధికారులు
- జిల్లా మహిళలకు అరకొరగానే 'మహాలక్ష్మి' లబ్ధి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ప్రతీ మండలం నుంచి వందల సంఖ్యలో కుటుంబాలు, ప్రతీ గ్రామం నుంచి పదుల సంఖ్యలో ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి తదితర అవసరాల నిమిత్తం హైదరాబాద్‌తో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నారు. అయితే ఇప్పటికీ జిల్లాలోని అనేక మండలాల నుంచి రాష్ట్ర రాజధానికి బస్సు సౌకర్యం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇక ఆర్థిక, ఉపాధి, సామాజిక రంగాల్లో మహిళలు మరింతగా దూసుకుపోతారనే లక్ష్యంతో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఏజెన్సీ జిల్లాలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు.

40 ఏళ్లు దాటినా..

జిల్లాలోనే అతి పెద్ద మండలంగా గుండాల ఉంది. ఈ మండలాన్ని 1985లో ఏర్పాటు చేశారు. 40 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు నేరుగా బస్ సౌకర్యం లేదు. ప్రజలకు పాలన మరింత చేరువ చేసే లక్ష్యంతో జిల్లాల విభజన చేసినప్పుడు గుండాల మండలం నుంచి 2016లో కొత్తగా ఆళ్లపల్లి మండలం ఏర్పాటైంది. దశాబ్దాలు గడుస్తున్నా ఈ మండలాల ప్రజలు రాష్ట్ర రాజధానికి చేరుకోవాలంటే అనేక తిప్పలు పడాల్సిందే. ఈ రెండు మండలాలు ఉన్న పినపాక నియోజకవర్గం మణుగూరులో ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ ఆయా గ్రామాల వారికి ఫలితం లేదు. కరకగూడెం మండల పరిస్థితి కూడా అంతే. ఈ మూడు మండలాల నుంచి రాష్ట్ర రాజధానికి చేరుకోవాలంటే పొరుగున ఉన్న వరంగల్ 1, 2 డిపోల బస్సులే ఆధారం. మణుగూరు, ఇల్లెందు డిపోలకు చెందిన అధికారులు తమ అవసరాలను గుర్తించేందుకు సిద్ధంగా లేరనే అభిప్రాయం ఆయా మండలాల ప్రజల నుంచి వినిపిస్తోంది. అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి మండలాల నుంచి కూడా ఆర్టీసీ బస్సు లేదు.

ప్రైవేటుకే అప్పగించారా ?

ప్రతీ రోజు రాత్రి చర్ల నుంచి ఆరు ప్రైవేటు బస్సులు స్లీపర్ సౌకర్యంతో హైదరాబాద్‌కు తిరుగుతున్నాయి. కానీ ఇప్పటి వరకు చర్ల, దుమ్ముగూడెం మండలాల నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ కూడా ఆర్టీసీ పరంగా అందుబాటులో లేదు. ఈ మార్గంలో బస్సు నడపడంలో ఆర్టీసీ చూపిస్తున్న అశ్రద్ధ ప్రైవేటు ఆపరేటర్ల పాలిట వరంగా మారుతోంది. మరోవైపు ఏజెన్సీ ప్రజలు, ముఖ్యంగా మహిళలు నెలల తరబడి కష్టపడి పొదుపు చేసుకున్న సొమ్ము ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీల పరం అవుతోంది. ఇంత జరుగుతున్నా కొత్తగూడెం, భద్రాచలం ఆర్టీసీ డిపో బాధ్యులకు చీమకుట్టినట్టయినా లేదనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు టేకులపల్లి, చండ్రుగొండ మండలాల నుంచి మొక్కుబడిగా ఒక్క సర్వీస్‌ను హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు.

రెండు, మూడు బస్సులు మారాల్సిందే



మా అబ్బాయి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. గుండాల నుంచి బాబు కోసం హైదరాబాద్ వెళ్లాలంటే కష్టపడి వరంగల్ లేదా ఖమ్మం చేరుకొని అక్కడి నుంచి పోవాల్సి వస్తోంది. ఈ ప్రాంతం నుంచి వివిధ అవసరాల నిమిత్తం పలువురు హైదరాబాద్ వెళ్తుంటారు. గుండాల నుంచి నేరుగా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి. మహాలక్ష్మి పథకం పెట్టినప్పటి నుంచి హైదరాబాద్ బస్ కోసం ఎదురు చూస్తున్నాం. – పిల్లి గౌతమి, గుండాల

'మహాలక్ష్మి'తో ఉపయోగం లేదు



నా కుమార్తె హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో చిన్నపాటి ఉద్యోగం చేస్తోంది. ఆమె దగ్గరకు మేము కనీసం నెలకు ఒకసారైనా వెళ్లి వస్తుంటాం. మా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో ప్రైవేటు బస్సులు ఎక్కాల్సి వస్తోంది. వాటిలో చర్ల నుంచి హైదరాబాద్‌కు రూ.600 నుంచి రూ.800 వరకు చెల్లించాల్సి వస్తోంది. అదే ఆర్టీసీ బస్సులుంటే ఆ డబ్బు మిగిలేది. – బట్టా కుమారి, చర్ల

ఏజెన్సీ వాసులకు ఇక్కట్లు



కరకగూడెం నుంచి హైదరాబాద్‌కు నేరుగా బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. మొదట మణుగూరు లేదా వరంగల్ వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ బస్సు ఎక్కాల్సి వస్తోంది. దీని వల్ల డబ్బు, సమయం వృథా అవుతున్నాయి. – ముంజాల వసంతరావు, కరకగూడెం

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు



తలంబ్రాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు

- ఆర్టీసీ కార్గో ద్వారా చేరవేసేలా ఏర్పాట్లు
- ఆన్‌లైన్ లేదా కార్గో పాయింట్లలో బుకింగ్‌కు అవకాశం

డిపోల వారీగా సంప్రదించాల్సిన నంబర్లు

ఖమ్మం	91542 98583
మధిర	91542 98584
సత్తుపల్లి	91542 98585
భద్రాచలం	91542 98586
కొత్తగూడెం	91542 98587
మణుగూరు	91542 98588
ఇల్లెందు	91542 98587

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో వచ్చేనెల 6న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి హాజరుకాలేని భక్తులకు తలంబ్రాలు ఇంటి వద్దే అందించనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం భక్తులు రూ.151 చెల్లించి ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకుంటే ముత్యంతో కూడిన తలంబ్రాల ప్యాకెట్‌ను ఇంటి వద్దే అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా బస్టాండ్లలోని కార్గో పాయింట్లు, ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

■ సత్తుపల్లిటౌన్: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాల బుకింగ్ వివరాలతో రూపొందించిన కరపత్రాలను సత్తుపల్లిలో ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ, మునీర్‌పాషా, బాబురావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు మెట్ల వద్ద కాయిర్ మ్యాట్లు



కాయిర్ మ్యాట్ వేస్తున్న కార్మికుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ తూర్పు మెట్లపై కాయిర్ మ్యాట్లను ఏర్పాటు చేస్తున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు వేసవి కాలంలో పాద రక్షలు విడిచి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ నేపథ్యంలో తూర్పు మెట్ల నుంచి ప్రసాదం కౌంటర్ వరకు ఈ కాయిర్ మ్యాట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు.

'రాబిన్ హుడ్' ప్రేక్షకులకు నచ్చుతుంది..

- సినీ నిర్మాత రవిశంకర్
- హీరో నితిన్‌తో కలిసి గుబ్బల మంగమ్మ ఆలయ సందర్శన



ఆలయంలో హీరో నితిన్



మాట్లాడుతున్న రవిశంకర్, దర్శకుడు వెంకీ

అశ్వారావుపేటరూరల్: ఛలో, భీష్మ సినిమాల తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో నిర్మించిన రాబిన్ హుడ్ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందని మైత్రీ మూవీ మేకర్ బ్యానర్ నిర్మాత రవిశంకర్ అన్నారు. ఏపీ – తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని అశ్వారావుపేట అటవీ ప్రాంతంలో గల శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాన్ని హీరో నితిన్‌తోపాటు చిత్ర బృందం సోమవారం సందర్శించింది. హీరో నితిన్ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 28న ప్రపంచ వ్యాప్తంగా పలు థియేటర్లలో సినిమా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సెన్సార్ వర్క్ జరుగుతోందని, ప్రమోషన్ల పనుల్లో ఉన్నట్లు చెప్పారు. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా సినిమా ఉంటుందన్నారు. దర్శకుడు వెంకీ మాట్లాడుతూ.. తన తొలి చిత్రం ఛలో, ఆ తర్వాత వచ్చిన భీష్మ సినిమాలు గుర్తింపు తెచ్చాయని, తాజా సినిమా ద్వారా ప్రేక్షకులకు వినోదంతోపాటు మంచి సందేశం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ హీరో చిరంజీవితో కూడా త్వరలోనే సినిమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ ప్రకాశ్‌రావు, కుదుముల రంగారావు, మదాల నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

పెదవాగు సమస్యకు పక్షం రోజుల్లో పరిష్కారం



పెదవాగు ప్రాజెక్ట్ వద్ద మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్, పక్కన కలెక్టర్, పీఓ, జలగం ప్రసాద్‌రావు

- తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధికారులతో ఢిల్లీలో చర్చిస్తా
- రెండు రాష్ట్రాల సీఎంలతోనూ మాట్లాడుతా
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ వెల్లడి
- అశ్వారావుపేట, చండ్రుగొండ, ములకలపల్లి మండలాల్లో పర్యటన

అశ్వారావుపేటరూరల్/చండ్రుగొండ/ములకలపల్లి : పెదవాగు ప్రాజెక్టు సమస్యను 15 రోజుల్లో కొలిక్కి తెస్తానని, దీనిపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎస్‌లకు నోటీసులు జారీ చేసి ఢిల్లీకి వచ్చేలా చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. గతేడాది జూలై 18న గండ్లు పడిన పెదవాగు ప్రాజెక్టును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత ఇది ఇంటర్ స్టేట్ ప్రాజెక్టుగా మారిందని, పునఃనిర్మాణం చేయాలంటే జీఎంఆర్‌బీ నిబంధనల ప్రకారం తెలంగాణ 15 శాతం, ఏపీ 85 శాతం వాటా నిధులు కేటాయించాల్సి ఉందని అన్నారు. రెండు రాష్ట్రాల సమన్వయంతోనే నిధుల విడుదల సాధ్యమని చెప్పారు. ఇందుకోసం ఇరు రాష్ట్రాల సీఎస్‌లతో పాటు భద్రాద్రి, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ ఎస్‌ఈలను ఢిల్లీ పిలిపించి ఈ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని తెలిపారు. ఇద్దరు ముఖ్యమంత్రులతోనూ చర్చిస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయలపై మాట్లాడుతూ అసభ్య పదజాలం వాడడంతో ఉన్నతాధికారులు, రైతులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన ప్రసంగం పూర్తి కాకముందే సభకు హాజరైన పలువురు వెనుదిరిగారు. అంతకుముందు ఆయన రెడ్డిగూడెంలో కొండరెడ్లతో మాట్లాడి జాతీయ ఎస్టీ కమిషన్, ట్రైకార్, ఐటీడీఏ ద్వారా కల్పించే అవకాశాలు, రుణాల గురించి వివరించారు. పెదవాగు సమీపంలోని శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

వెంగళరాయ సాగర్ పరిశీలన..

చండ్రుగొండ మండలం సీతాయిగూడెం సమీపంలోని వెంగళరాయసాగర్‌ను హుస్సేన్‌నాయక్ పరిశీలించారు. ఇది శిథిలావస్థకు చేరి ఆరేళ్లయినా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికీ శాశ్వత మరమ్మతులు చేయించలేదని, ఒక పంటకు కూడా నీళ్లు సరిపోవడం లేదని రైతులు, చేపలు సక్రమంగా పెరగడం లేదని మత్స్యకారులు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా పేదరైతులు ఆధారపడిన ఈ ప్రాజెక్ట్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. పేదల దుస్థితిపై మంత్రులు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. గిరిజనుల ఓట్లతో గెలుపొందిన వారు పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఆర్‌ఓఆర్ పట్టాలు పొందిన భూముల్లో విద్యుత్ సదుపాయం, బోరుబావుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్‌కు సూచించారు. ఆ తర్వాత ములకలపల్లి మండలం సంద్రకుంటలో జరిగిన ఎస్టీ కోయ ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని ఆరోపించారు. ఆదివాసీలకు ఏమైనా సమస్యలుంటే ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్టీ కమిషన్ కోర్టు లాంటిదని, సత్వర సమస్యల పరిష్కారానికి ఇది మంచి మార్గమని తెలిపారు. మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో జేవీఆర్ ట్రస్ట్ చేపడుతున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామంలో సిమెంట్ రేకులతో షెడ్డును పోలిన అంగన్‌వాడీ కేంద్రాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన సత్యావతి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారని, ఆమె అత్త నాగమ్మ రెండు కుంటల భూమి దానం ఇవ్వడంతో, తాత్కాలికంగా రేకులు వేసి, క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పగా పక్కా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీడీఏ పీఓ రాహుల్, ఆర్డీఓ మధుసూదన్, డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్, మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాస్, ఐటీడీఏ డీడీ మణెమ్మ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్‌కుమార్, డీఈలు కృష్ణ, బాపనయ్య ములకలపల్లి తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ రేవతి పాల్గొన్నారు.

సమన్వయంతోనే సాధ్యం

పెదవాగు ప్రాజెక్టు పునఃనిర్మాణానికి సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఇరు రాష్ట్రాల సమన్వయంతోనే పరిష్కారం సాధ్యమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రాజెక్టు పునఃనిర్మాణానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, ఇప్పుడున్న మూడు గేట్లను పెంచాల్సి ఉంటుందని చెప్పారు. డిజైన్ సక్రమంగా ఉంటేనే మరో 50 ఏళ్ల పాటు ప్రాజెక్టు నిలుస్తుందని వివరించారు. వెంగళరాయ ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఆర్‌ఓఎఫ్ఆర్ భూముల్లో రైతులకు అన్ని సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఆయిల్‌పాం సేద్యంపై దృష్టి సారించాలని సూచించారు.

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

డీఈఓ వెంకటేశ్వరా చారి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 12,282 మంది రెగ్యులర్, 686 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, వీరి కోసం 73 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 77 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 871 మంది ఇన్విజిలేటర్లు, 73మంది సిట్టింగ్, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి అనుమతించరని, పరీక్ష విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు సైతం సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తామని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ నంబర్ 99666 00678 ను సంప్రదించాలని సూచించారు.

మాధారం పాఠశాలలో తనిఖీ

ములకలపల్లి: మండలంలోని మాధారం ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ వెంకటేశ్వరా చారి, జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సతీష్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న టాయిలెట్లను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను పరిశీలించారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

బీటీపీఎస్ సీఈ బిచ్చన్న



కేక్ కట్ చేస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి జెన్‌కో సంస్థ ప్రాధాన్యమిస్తోందని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బి.బిచ్చన్న తెలిపారు. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌పీఈయూ)–1535 వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకుంటూ అధిక ఉత్పత్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.ప్రసాద్, ఆర్.రామచందర్, ఎం.రాజమనోహర్, ఎస్‌డి రఫీ, టి.అనిల్‌కుమార్, ఎ.వెంకటేశ్వర్లు, జార్జ్, పుల్లారావు, జి రవికుమార్, వీరబాబు, వింజమూరు మురళి, చిక్కా వెంకటరమణ, ఆర్.రవిచంద్ర, జానీ బేగం, ఈశ్వరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యూట్రిషియన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: క్షయ వ్యాధిగ్రస్తులు న్యూట్రిషియన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలో 1,050 మందికి కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు ప్రభుత్వమే ఉచితంగా ఆరు నెలలపాటు పూర్తిగా ఉచితంగా మందులు అందిస్తుందని పేర్కొన్నారు. వైద్యాధికారులు బి.బాలాజీ, హరీష్, పాయం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమాధికారి లెనీనా

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : వేసవిలో చిన్న పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి జేఎంఎస్ లెనీనా అన్నారు. మండలంలోని ఎర్రగుంట సెక్టార్ శాంతినగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటి పెంచాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సలోని, సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

మహిళపై దాడి

ఇల్లెందు: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన బానోత్ మంగమ్మ సోమవారం చేను వద్ద పనిచేస్తుండగా అదే గ్రామానికి చెందిన సంపత్ అత్యాచారానికి యత్నించాడు. తప్పించుకుని వెళ్తుండగా రాయితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

దుమ్ముగూడెం : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. రేగుబల్లి గ్రామ శివారులో గోదావరి నది నుంచి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో పాత మారేడుబాక గ్రామానికి చెందిన గుండి చిట్టిబాబు, కుర్సం కనకరాజు, తూరుబాక గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరస్పరం దాడి : కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం న్యూగొల్లగూడెంలోని ఇద్దరు అన్నదమ్ములు పరస్పరం దాడి చేసుకోగా త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. న్యూగొల్లగూడేనికి చెందిన సోదరులు గుమ్మడెల్లి రమణ, దుర్గా మధ్య ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం అనుచరులతో ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. పరస్పరం ఫిర్యాదు చేసుకోగా పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

కాపర్ వైరు చోరీ చేస్తున్న వ్యక్తి పోలీసులకు అప్పగింత



రైతులు పట్టుకున్న వ్యక్తి

అశ్వాపురం: వ్యవసాయ మోటార్లలో కాపర్ వైరు చోరీ చేస్తున్న వ్యక్తిని రైతులు సోమవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో రైతులు పర్శబోయిన సుధాకర్, రాసబంటి లింగరాజు, నాగరాజు, ఆవుల ఎల్లయ్య, మదమంచి నరసింహారావుకు చెందిన మోటార్ల కాపర్ వైరు చేసిన పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన మొద్దుల నరేష్‌ను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇతనిపై గతంలో పాల్వంచ మండలంలో కేసు కూడా నమోదైనట్లు సమాచారం.

మనస్తాపంతో లారీడ్రైవర్ బలవన్మరణం

కొణిజర్ల: ఓ వైపు అప్పుల బాధ, మరోవైపు పెళ్లయిన కొద్దిరోజులకే కూతురి భర్త మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక మద్యానికి బానిసైన ఓ లారీ డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని తనికెళ్ల గంగెద్దపాడుకు చెందిన లారీ డ్రైవర్‌కు తాళ్ల ఆనందరావు (51)కు భార్య శౌరమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు వివాహం చేయగా ఈ ఏడాది జనవరిలో అల్లుడు మృతి చెందాడు. అప్పటి నుంచి మనస్తాపంతో మద్యానికి బానిసైన ఆనందరావు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరివేసుకుని మృతి చెందాడు. ఘటనపై భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

అన్నార్తులకు అండగా..



శ్రీ రంగనాథ స్వామి ఆశ్రమం (ఫైల్) (ఇన్‌సెట్) షిరిడీ సాయిబాబా

శ్రీ రంగనాథ స్వామి ఆశ్రమం అన్నార్తుల ఆకలి తీర్చుతోంది. పరిసర ఐదారు గ్రామాల్లోని అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి గురువారం వారి ఇంటివద్దకే భోజనాలు పంపిస్తోంది. దాతల సహకారంతో వారంలో ఒకసారి 200 మందికి ఆహారం అందిస్తోంది. శివనామస్మరణకు వచ్చిన భక్తుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, స్థానిక మహిళ ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఆర్థికంగా అండగా నిలుస్తోంది. –దమ్మపేట

శ్రీరంగనాథ స్వామి ఆశ్రమ సేవా కార్యక్రమాలు

- ప్రతీ గురువారం నిరుపేదల ఇంటి వద్దకే భోజనం
- నిర్వహణతోపాటు ఆర్థికంగా తోడ్పడుతున్న స్థానికురాలు శ్రీదేవి
- దాతలు, మిత్రుల సహకారంతో వారానికోసారి అన్నదానం

ఆశ్రమ ప్రస్థానం

దేశంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలు శ్రీశైలం, శ్రీకాళహస్తి, అరుణాచలం, కాశీ వంటి సమీప ఆశ్రమాల్లో శివ నామస్మరణ సాధన చేసిన రంగనాథస్వామి అనే భక్తుడు 2017లో మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో వేంచేసియున్న స్వయంభూ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ సన్నిధికి చేరుకున్నాడు. శివాలయం సమీపంలో గుట్టపై ప్రశాంత వాతావరణం ఉండటంతో ధ్యానం చేయసాగాడు. దీంతో పలువురు భక్తులు కూడా ధ్యానానికి రావడం ప్రారంభించారు. భక్తుల సంఖ్య క్రమేపీ పెరగడంతో దాతల సహకారంతో 2021లో చిన్నపాటి భవనం నిర్మించి ఆశ్రమం ప్రారంభించాడు. అప్పటి నుంచి ప్రతి గురువారం అన్నదానం చేస్తున్నాడు. తొలుత 11 మందితో అన్నదానం ప్రారంభమైంది.

2023లో సాయిబాబా ఆలయ నిర్మాణం

ఆశ్రమంపై మొదటి అంతస్తులో షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మించారు. ఆశ్రమ బాధ్యురాలైన శ్రీదేవి తన సొంత డబ్బులతో పాటు దాతలు, బంధువులు, మిత్రుల ఆర్థిక సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆలయంలో శ్రీదత్తాత్రేయ, గణపతి సహిత సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు. 2023 అక్టోబర్ 23న ఆలయం ప్రారంభంకాగా, 2024 అక్టోబర్ 21న విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి..

ముష్టిబండకే చెందిన యూకేలో, అనంతరం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన కూకలకుంట శ్రీదేవి గ్రామానికి వచ్చినపుడు ఆశ్రమానికి ఆర్థిక సాయం అందించేంది. 2018లో నెలకు రూ.1.20 లక్షల ఉద్యోగం మానేసి ఆశ్రమంలో సేవకు అంకితమై నిర్వహణ బాధ్యతలు చూసుకుంటోంది. విదేశాల్లో ఉంటున్న తన సోదరి, మిత్రుల సహకారంతో అన్నదానం కార్యక్రమం కొనసాగిస్తోంది. ప్రస్తుతం ప్రతి గురువారం సుమారు 200 మందికి భోజనాలు అందిస్తున్నారు. దాతలు, సేవకుల సహకారంతో ఆశ్రమం వద్దనే వంట చేసి, పార్సిళ్లు కట్టించి నిరుపేదల ఇంటికి చేర్చుతున్నారు. ముష్టిబండ, వడ్లగూడెం, మందలపల్లి, మల్కారం తదితర గ్రామాల్లో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆకలి తీర్చుతున్నారు. సమీప గ్రామాలకు చెందిన సుమారు 10 మంది వరకు మహిళలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు.



నిరుపేదలకు పంచడానికి భోజన పార్సిళ్లను సిద్ధం చేస్తున్న ఆశ్రమ సేవకులు(ఫైల్)

ఇతర సేవా కార్యక్రమాలు

ఆశ్రమం ఆధ్వర్యంలో చలికాలంలో దుప్పట్లు, స్వెటర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలోబాధితులకు నిత్యావసరాలను వితరణ చేశారు. ప్రతి గురువారం పేదల ఇంటి వద్దకే భోజనం పంపిస్తున్నామని దాతల సహకారం అందిస్తే ఆశ్రమంలోనే అనాధ శరణాలయం ప్రారంభిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

ఆకలి తీర్చడమే పరమానందం



స్వయంభూగా వెలిసిన శ్రీ దుర్గా మల్లేశ్వరుని సన్నిధిలో శివనామస్మరణ కోసం వచ్చాను. భక్తుల సహాయ సహకారాలతో ఆశ్రమం నిర్మించాం. వారంలో ఒకసారి సుమారు 200 మందికి అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్నిస్తోంది. నిర్వహణలో, ఆర్థిక సహకారంలో కూకలకుంట శ్రీదేవి పాత్ర మరువలేనిది. పలువురు సేవకులు భోజనం పార్సిళ్లు సిద్ధం చేసి పేదల ఇళ్లకు చేర్చుతున్నారు. –రంగనాథ స్వామి, ఆశ్రమ స్థాపకుడు

శరణాలయం ప్రారంభించాలని..



అన్నదానం చేయడంలో ఆనందం ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి 2018 నుంచి ఆశ్రమ సేవకు అంకితమయ్యాను. నా శక్తిసామర్థ్యాల మేరకు ఆశ్రమ అభివృద్ధితో పాటుగా నిరుపేదల ఆకలి తీర్చేందుకు కృషి చేస్తాను. దాతల సహకారం తోడుంటే రోజూ అన్నదానం చేయాలనే తలంపుతో ఉన్నాం. అనాథ శరణాలయం ప్రారంభించాలనేది నా అభిలాష.

–కూకలకుంట శ్రీదేవి, ఆశ్రమ నిర్వాహకురాలు, ముష్టిబండ

ఆకలి తీరుస్తున్నారు...



ప్రతి గురువారం ఆశ్రమం నుంచి నేరుగా మా ఇంటికి భోజనం పార్సిల్‌ను పంపి, నా ఆకలిని తీరుస్తున్నారు. మావూరితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా వృద్ధులకు భోజనం అందిస్తున్నారు. అనాథలకు ఒకపూట అయినా కడుపు నిండా భోజనం దొరుకుతుంది. దివ్యాంగులు, వృద్ధులకు ఆశ్రమం ద్వారా ప్రతి రోజూ భోజనం అందేలా చూడాలని కోరుతున్నాను.

–ఎస్కే మైబూబీ, వృద్ధురాలు, ముష్టిబండ

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు వినతి

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని పీకే–1 ఇంక్లెన్ ఏరియాలో నిర్మిస్తున్న సెల్ టవర్‌ను నిలిపివేయాలని స్థానికులు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటికే బీటీపీఎస్, సింగరేణి, సోలార్ ప్లాంట్, హెచ్‌డబ్ల్యూపీ(ఎం) పరిశ్రమల కారణంగా అధిక కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, దీనికితోడు సెల్ టవర్ నిర్మిస్తే రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యం పాలవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం సీసా చట్టం, గిరిజన హక్కులకు వ్యతిరేకంగా జరుగుతోందని ఆరోపించారు.



మానవహక్కుల కమిషన్ ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

భానుడి భగభగ.. చెట్టు నీడన రైతుల సేద



చింత చెట్టు కిందకు చేరిన ఆయకట్టు రైతులు

అశ్వారావుపేటరూరల్: భానుడి భగభగలతో అల్లాడుతున్న అన్నదాతలు ఓ చెట్టు నీడన సేదతీరారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి పెదవాగు ప్రాజెక్ట్ వద్దకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు రావడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయకట్టు రైతులు భారీగా తరలివచ్చారు. ప్రాజెక్ట్ వద్ద రైతుల కోసం టెంట్‌లు ఏర్పాటు చేసినా ఉక్కపోత కారణంగా రైతులు కుడి కాలువ పక్కనే ఉన్న ఓ భారీ చింత చెట్టు కిందకు చేరారు. చెట్టు నీడన, చల్లదనంతో ఉపశమనం పొందారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణాలను అపహరించిన ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కథనం ప్రకారం.. గత నెల 19న పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లోని కిరాణా షాపులో ఉన్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీ ఘటనకు సంబంధించి ఈ నెల 11న ఒకరిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా గాలింపు చేపడుతున్నారు. సోమవారం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రూ. 2.35 లక్షల విలువైన ఆభరణాలు, బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

మిర్చి తగులబెట్టిన ఘటనలో...

పినపాక: ఇటీవల వెంకటరావుపేట గ్రామంలో కల్లంలో మిర్చిని తగలబెట్టిన నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ.బయ్యారం పోలీసుల కథనం ప్రకారం..అదే గ్రామానికి చెందిన తాండ్ర బాలకృష్ణ, అతని బంధువు పంచర్ల వెంకటేశ్వర్లు కలిసి పురుషోత్తం అనే రైతుకు చెందిన మిర్చిపై ఈ నెల 10న అర్ధరాత్రి పెట్రోల్ పోసి నిప్పంటించారు. పురుషోత్తం చేతబడి చేయడంతోనే తన భార్య చనిపోయిందని బాలకృష్ణ కక్ష పెంచుకుని ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో వెల్లడయింది. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

న్యాయవ్యవస్థపై అవగాహన అవసరం

కొణిజర్ల: బాలికలు న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావు తెలిపారు. తనికెళ్లలోని తెలంగాణ గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఆకాంక్ష ట్రస్టు ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన బాలికల సంరక్షణకు ఉన్న చట్టాలు, సెక్షన్లను వివరించారు. ఆయా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

టేకులపల్లి: ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సోమవారం కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండా గ్రామానికి చెందిన బాదావత్ చిన్న లక్ష్మా (60) భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా పొలం వద్ద పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో మరొకరు...

దమ్మపేట: భార్య మందలించిందనే కారణంగా మద్యం మత్తులో ఓ వ్యక్తి సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామానికి చెందిన పొండ్ల నాగరాజు(42) మద్యానికి బానిసగా మారి ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో భార్య సత్యావతి మందలించింది. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఏఎస్సై బాలస్వామి తెలిపారు.

అత్యాచార యత్నం

ఇల్లెందు: అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన భూక్య సునీతపై అదే గ్రామానికి చెందిన నాగరాజు ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

బియ్యం లారీ సీజ్



పోలీసులు పట్టుకున్న బియ్యం లారీ

అశ్వాపురం: మణుగూరు నుంచి పాల్వంచ వైపు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక నిఘా పెట్టి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ఎదుట బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీలో సుమారు 180 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేపు దివ్యాంగుల ఉపకరణాలు పంపిణీ



మాట్లాడుతున్న ఎస్‌కే సైదులు

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగ విద్యార్థులకు ఈ నెల 19న సహాయ ఉపకరణాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమగ్ర శిక్షా, ఆర్టిఫిషియల్ లింబ్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో గతేడాది ఆగస్టులో ప్రత్యేక శిబిరం నిర్వహించి, 288 మంది అర్హులను గుర్తించినట్లు పేర్కొన్నారు. వారికి ఈ నెల 19న కొత్తగూడెంలోని ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ చేతుల మీదుగా ఉపకరణాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు రెండు ఫొటోలు, సదరం ధ్రువపత్రం, పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ ధ్రువీకరణతో ప్రభుత్వ వైద్యుడి నుంచి తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని కోరారు. బ్రెయిలీ కిట్లు–13, హియరింగ్ ఎయిడ్–33, వీల్‌చైర్లు–76, ఎంఆర్ కిట్లు–96, ట్రైసైకిళ్లు–16, రోలెటర్లు–29, కాలిపర్స్–23, బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ ట్రైసైకిల్–2, ఇతరాలు–64 పంపిణీ చేస్తారని ఆయన వివరించారు. సమావేశంలో హెచ్‌ఎం మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్తులను కాపాడాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఓ జాకీర్ హుస్సేన్

సింగరేణి(కొత్తగూడెం): శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో అమలు చేస్తూ సంస్థ ఆస్తులను కాపాడాలని సింగరేణి ఎస్‌అండ్‌పీసీ ట్రెనింగ్ ఆఫీసర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ట్రెనింగ్ సెంటర్‌లో 35వ బ్యాచ్ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాక్షి ఉద్యోగి మృతి



తాటిపల్లి రాజేష్‌కుమార్(ఫైల్)

కొత్తగూడెంటౌన్: మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సాక్షి దినపత్రిక ఉద్యోగి సోమవారం మృతి చెందాడు. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని న్యూగొల్లగూడేనికి చెందిన తాటిపల్లి రాజేష్‌కుమార్(38) సాక్షి దినపత్రికలో సీనియర్ యాడ్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14న మధ్యాహ్నం బైక్‌పై రామవరంలో స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కొత్తగూడెం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అదే కారులో క్షతగాత్రుడిని కొత్తగూడెం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు, అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఏడేళ్లలోపు కూతుళ్లు ఇద్దరు ఉన్నారు.

సాక్షులపై బెదిరింపులు?

పోలీసుల విచారణలో ప్రమాదానికి కారణమైన కారు రుద్రంపూర్ తిలక్‌నగర్‌కు చెందిన వ్యక్తిదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ప్రభుత్వ సబ్సిడీపై పొందిన కారు అయినప్పటికీ మూడేళ్లుగా నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో కారు నడిపింది ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. రోడ్డు ప్రమాదాన్ని చూసిన సాక్షులను సైతం కారుతో ఢీకొట్టినవారు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్‌ను వివరణ కోరగా.. బైక్‌ను కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. కారు రుద్రంపూర్ తిలక్‌నగర్‌కు చెందిన వ్యక్తిదిగా గుర్తించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఇంకా ఫిర్యాదు అందలేదని వివరించారు.

ఏడాదిలో 290 సెల్‌ఫోన్ల రికవరీ

ఖమ్మం అదనపు డీసీపీ నరేష్‌కుమార్

ఖమ్మం క్రైం: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తుండగా, ఐటీ సెల్ బృందం ట్రాక్ చేశాక స్వాధీనం చేసుకుని బాధితులకు అందిస్తున్నామని ఖమ్మం అదనపు డీసీపీ నరేష్‌కుమార్ తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో రూ.7లక్షల విలువైన 48 ఫోన్లను యజమానులకు ఆయన అందజేసి మాట్లాడారు. ఇందులో రూ.10వేలు మొదలు రూ.1.50 లక్షల విలువైన ఫోన్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే 680 ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోర్టల్‌లో నమోదు కాగా 582ఫోన్లను గుర్తించి, 290 ఫోన్లు రికవరీ చేశామని చెప్పారు. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఐటీ సెల్ నోడల్ ఆఫీసర్, ఏసీపీ వెంకటేశ్, ఎస్సై నత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ హేమనాథ్, కానిస్టేబుళ్లు నరేష్, శ్రీనును కమిషనర్, అదనపు కమిషనర్ అభినందించారు.



ఫోన్లు అందుకున్న వారితో అదనపు డీసీపీ, అధికారులు

సీజ్ చేసిన వాహనాలు దగ్ధం



మంటల్లో కాలిపోయిన వాహనాలు

ములకలపల్లి: వివిధ ఘటనల్లో అధికారులు సీజ్ చేసిన వాహనాలు అగ్గికి ఆహుతయ్యాయి. మండలకేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ ఎదురుగా గెస్ట్‌హౌస్ సమీపంలో సుమారు పదేళ్లుగా స్వాధీనం చేసుకున్న వాహనాలను నిలిపి ఉంచారు. సోమవారం ఆ ప్రదేశంలో నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. మంటలు అంటుకుని వాహనాలు కూడా దగ్ధమయ్యాయి. స్థానికులు, గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. కాగా పోలీస్ స్టేషన్‌ను నూతన ప్రదేశంలో మార్చిన క్రమంలో వాహనాలను కూడా అక్కడికి తరలిస్తే ముప్పు తప్పి ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు.